జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com


మంగళవారం | 10-3-2026 శ్రీకాకుళం సంపుటి: 3 సంచిక: 612 పేజీలు: 4 వెల : రూ.7




# రీసర్వేలో.. రెవెన్యూ.. మాయాజాలం!



* అధికారుల జిమ్మిక్కులు.. బాధితులకు కన్నీళ్లు
* వివాదాలకు నిలయంగా మందస మండల అధికారుల తీరు
* బాధితుల ఫిర్యాదులు బుట్టదాఖలు
* ఉన్నతాధికారులకు మరోసారి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న బాధితులు



**మందస, మార్చి9(వార్త):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ-సర్వే ప్రక్రియ మందస మండలంలో వివాదాలకు నిలయంగా మారింది. నిబంధనల ప్రకారం భూ యజమానుల సమక్షంలో పారదర్శకంగా జరగాల్సిన సర్వే, అధికారుల 'జిమ్మిక్కుల'తో బాధితులకు కన్నీరు మిగిలిస్తోంది. ఎం గంగువాడ గ్రామానికి చెందిన కే. సంధ్యారాణి అనే మహిళా బాధితురాలికి ఎదురైన అనుభవమే ఇందుకు నిదర్శనం.

## అసలేం జరిగింది?

లక్ష్మీపురం పరిధిలోని సర్వే నంబరు 11-4 లో ఉన్న 3.60 ఎకరాల భూమికి సంబంధించి 2019 రికార్డుల ప్రకారం కోడ జంగమయ్య పట్టాదారుగా ఉన్నారు. అయితే, 2022లో జరిగిన సర్వే సమయంలోనే అక్రమాలు జరుగుతున్నట్లు గుర్తించిన బాధితురాలు సంధ్యారాణి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన యంత్రాంగం ఆ రికార్డులను వెంటనే బ్లాక్ లిస్ట్‌లో పెట్టింది. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ, కొందరు స్థానిక రెవెన్యూ సిబ్బంది తమ మాయాజాలాన్ని ప్రదర్శించారు. విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ గణపతి, సర్వేయర్ మైలపిల్లి ప్రశాంత్ కుమ్మక్కై, రికార్డుల్లో లేని వ్యక్తుల పేర్లను కొత్త పట్టాదారులుగా చేర్చినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. కోడ జంగమయ్య పేరును తొలగించి, ఆ స్థానంలో కోడ కృష్ణారావు, కోడ తేజేశ్వరరావు అనే పేర్లను చేర్చి రికార్డులను తారుమారు చేశారు.

## తహసీల్దార్ కార్యాలయంలో వేధింపులు

తమకు జరిగిన అన్యాయంపై మరోసారి కలెక్టర్‌ను ఆశ్రయించడంతో ఈ వివాదం తహసీల్దార్ కోర్టుకు చేరింది. అయితే, న్యాయం చేయాల్సిన అధికారులు బాధితురాలిని కార్యాలయం చుట్టూ తిప్పించుకోవడమే కాకుండా, కనీస గౌరవం ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తున్నారని సమాచారం. బాధితుల ఫిర్యాదులను బుట్టదాఖలు చేస్తూ, క్షేత్రస్థాయిలో అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**రేపటి సంచికలో : న్యాయం కోసమొస్తే అవమానాలే మిగిలాయి.. మందస తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తీరుపై ప్రత్యేక కథనం!**



### ఆదిత్యుని తాకని
## సూర్య కిరణాలు

**అరసవల్లి, మార్చి 9 (వార్త):** అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామి మూలవిరాట్‌ను సోమవారం మబ్బుల కారణంగా సూర్యకిరణాలు తాకలేదు. అయితే పెద్ద ఎత్తున భక్తులు ఉదయం ఐదు గంటలకే సూర్యనారాయణస్వామి దేవస్థానానికి తరలివచ్చారు. సూర్యకిరణాలు తాకకపోవడంతో కొంత నిరాశకు గురయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ మాట్లాడుతూ మబ్బుల కారణంగా సోమవారం ఆదిత్యుని మూలవిరాట్‌కు సూర్యకిరణాలు తాక లేదని, మంగళవారం తాకే అవకాశం ఉందన్నారు.



### లింగాలపాడు వద్ద
## రోడ్డు ప్రమాదం

* వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

**జలుమూరు, మార్చి9 (వార్త):** జలుమూరు మండలం లింగాలపాడు గ్రామం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. లింగాలపాడుకు చెందిన సూర్యనారాయణ (79) సోమవారం ఉదయం బహిర్భూమికి వెళ్లి తిరిగి వస్తుండగా నరసన్నపేట వైపు వెళ్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయమై భారీగా రక్తస్రావం జరిగింది. దీంతో సూర్యనారాయణ అక్కడికక్కడే అపస్మారక స్థితికి చేరుకుని కొద్ది సేపటికే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ బాబు తెలిపారు.

### సున్నాపూర్ పోర్టుకు..
## భూములు ఇచ్చేది లేదు!

* ఒడిశాలో పీపీపీ విధానంలో పోర్టు నిర్మాణం
* సరిపడని ఒడిశా భూభాగం
* ఆంధ్రా సరిహద్దు భూమి సేకరణకు సర్వే
* అడ్డుకున్న పెద్ద లక్ష్మీపురం గ్రామస్తులు



**ఇచ్ఛాపురం, మార్చి 9 (వార్త):** ఇచ్ఛాపురం మండలం బూర్జపాడు పంచాయితీ పెద్దలక్ష్మీపురం పరిసర ప్రాంతాలలో భూములను ఒడిశా ప్రభుత్వం ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతం సున్నాపురం వద్ద పీపీపీ విధానంలో ఓడరేవు నిర్మాణం కొరకు ఒడిస్సా అధికారులు భూములు సర్వే చేస్తున్నారు. సర్వేలో భాగంగా సోమవారం ఒడిస్సా భూములతో పాటు ఆంధ్రా భూములను కూడా సర్వే చేపట్టారు. దీంతో తమ భూములను ఒడిస్సా ప్రభుత్వానికి ఇచ్చేది లేదంటూ స్థానికులు ఆందోళన చేపట్టారు. ఓడ రేవు నిర్మాణం కొరకు 6741 ఎకరాల భూములు కావాల్సివుంది. అయితే ఒడిస్సాకు చెందిన 5వేలు ఎకరాలు మాత్రమే ఉన్నాయి. ఇంకా 1741 ఎకరాలు ఆంధ్రా భూములు అవసరమని ఇటీవల సర్వే చేశారు. కొద్దిరోజులుగా భూములు సర్వేచేపట్టి హద్దులు వేస్తున్నారు. ఇదే జరిగితే ఆంధ్రాప్రాంతంలో ఉన్న పంటభూములతో పాటు నివాసాలు కూడా లేకుండా నిరాశ్రయులు అయిపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒడిస్సా అధికారులు వేసిన హద్దులు ఆంధ్రా భూములలో ఉన్నాయని పెద్ద లక్ష్మీపురం గ్రామస్థులు తెలియజేస్తున్నారు. తమ నివాస స్థలాలు ఉండే భూములను పోర్టు భూములుగా గుర్తిస్తే నివాసాలు కోల్పోతామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకొని తమకు ఎటువంటి నష్టం జరగకుండా చూడాలని వారంతా కోరుతున్నారు. ఈ విషయమై తహశీల్దార్ ఎన్.వెంకటరావును వివరణ కోరగా ఇప్పటి వరకు ఎటువంటి ఆదేశాలు రాలేదని ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి గ్రామస్థులకు ఎటువంటి నష్టం జరగకుండా అన్ని విధాల చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### తాగుతూ..
## ఊగుతూ..!

* మద్యం మత్తులో జోగుతున్న గ్రామాలు
* ఎక్కడికక్కడే బెల్ట్ షాపులు * యథేచ్ఛగా అమ్మకాలు



4లో

# కొండలు కొల్లగొట్టి.. కోట్లలో దందా!



* రాత్రి వేళల్లో మట్టి, కంకర దోచేస్తున్న మాఫియా
* టిప్పర్లతో గుట్టుచప్పుడు కాకుండా తరలింపు
* ఎమ్మెల్యే ఇంటికి సమీపాన వెంచర్లకు మట్టి, కంకర రవాణా



**పలాస, మార్చి 9 (వార్త):** పలాస మండలంలో మట్టి, కంకర అక్రమ తవ్వకాల మాఫియా రోజురోజుకు రెచ్చిపోతోంది. రాత్రివేళల్లో జేసీబీలతో కొండలను తవ్వి టిప్పర్లతో మట్టి, గ్రావెల్ తరలిస్తూ భారీ స్థాయిలో కాసులు కూడబెట్టుకుంటున్నారు. పలాస మండలంలోని కంబిరిగాం, కొత్తూరు కొండ, రాజగోపాలపురం, మహదేవిపురం, లోద్దభద్ర కొండ ప్రాంతాలను గుల్ల చేస్తున్నారు. పగలు ప్రశాంతంగా కనిపించే ఈ ప్రాంతాలు రాత్రి పడితే మాత్రం జేసీబీలు, టిప్పర్ల శబ్దాలతో మారుమోగుతున్నాయి. ఒక్క టిప్పర్ మట్టిని సుమారు రూ.7వేల వరకు విక్రయిస్తున్నారు. కంకర తరలింపు మరో రెండు రెట్లు ధరతో తరలిస్తున్నారు. ఈ వ్యాపారం కోట్లలో సాగుతోంది. కోసంగిపురం జగనన్న కాలనీ సమీపంలోని కొండను కూడా తవ్వి గ్రావెల్‌ను అక్రమంగా వెంచర్లకు సరఫరా చేస్తున్నారు. ఈ తవ్వకాల కారణంగా కొండల ఆకృతి మారిపోతోంది. కొండపై ఉన్న చెట్లను కొట్టేస్తూ పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నారు. ఈ తవ్వకాల వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ నేతల అండదండలతోనే ఈ దందా సాగుతోంది. దీంతో పోలీసులు, మైన్స్, రెవెన్యూ శాఖల అధికారులు మౌనం వహిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ అక్రమ తవ్వకాలపై దృష్టి సారించాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

## గ్లకోమా వ్యాధిపై అప్రమత్తత అవసరం



**మందస, మార్చి 9(వార్త):** గ్లకోమా వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆప్తాలమిక్ అధికారి రోణంకి వెంకటరమణ అన్నారు.

ప్రపంచ గ్లకోమా వారోత్సవాల సందర్భంగా మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల సరియాపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శిబి రంలో 30మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్లకోమా (నీటికాసులు) కంటి నాడి దెబ్బతినే ప్రమాదకరమైన వ్యాధి అని, 40సంవత్సరాల పైబడినవారు, గ్లకోమా వ్యాధి చరిత్ర ఉన్న కుటుంబ సభ్యులు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు.

గ్లకోమా ప్రారంభ దశలో ఎటువంటి లక్షణాలు కనిపించవని, కంటిలో ఒత్తిడి పరీక్ష, కంటి నాడి, రెటీనా పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సత్తెమ్మ, ఆశా బి.రాజేశ్వరి పాల్గొన్నారు.

## గాయపడిన గురువుకు శిష్యుల చేదోడు



**మందస, మార్చి 9(వార్త):** తీవ్రంగా గాయపడిన ఓ గురువుకు శిష్యులు ఉడతా భక్తి సాయమందించారు. మందస మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన భాష్యం మోహనరావు అనే ఉపాధ్యాయ శిక్షణ పొందారు. ఉద్యోగం రాకపోవడంతో వృద్ధాప్యంలో కూడా మందస మండలంలోని బహడపల్లి జడ్పీహెచ్ఎస్ లో కమిటీ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఇటీవల బహడపల్లి నుంచి హరిపురం గ్రామానికి తిరిగివస్తుండగా ఆయన ప్రయాణిస్తున్న ఆటోను ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో ఆటో బోల్తా పడడంతో మోహనరావు కాలు విరిగింది. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఆయన శిష్యులు (1982-83 ఎస్ఎస్సీ బ్యాచ్, హరిపురం), మిత్రుల సహకారంతో రూ.17వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మోహనరావు శిష్యులు మార్పు జగన్మోహనరావు, పుల్లా వాసుదేవరావు, తోట చంద్రశేఖర్, జన్ని వాసు, సానా మాధవరావు, చిక్కాల జగన్నాథరావు, మజ్జి వైకుంఠరావు, శమల్ల యోగేశ్వర రావు, వారణాసి ధామోదరం, నల్ల లోకనాథం, గుంట ఆనందరావు, కరగాన నీల కంఠం, సార సత్యనారాయణ, సుగ్గు వెంకటరమణ, వాయలపల్లి తిరుపతి, ప్రధాన లజిపతిరాయ్, గుడియా సింహాద్రి తదితరులు పాల్గొన్నారు. మోహనరావు తొందరగా కొలుకోవాలని ఆకాంక్షించారు.

## కొత్తపల్లి పాఠశాలలో..
## ఘనంగా మహిళా దినోత్సవం



**మందస, మార్చి 9(వార్త):** కొత్తపల్లి జిల్లా ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కూన వేణుగోపాలరావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. నేటి సమాజంలో మహిళలు సాధించాల్సిన లక్ష్యాలు, వివిధ రంగాల్లో వారు రాణిస్తున్న తీరు, మహిళల అభ్యున్నతికి డా.బీ.ఆర్ అంబేద్కర్, సావిత్రి భాయి పూలే, మదర్ థెరిసా వంటి గొప్ప వ్యక్తులు చేసిన కృషి గూర్చి ఉపాధ్యాయులు, విద్యార్థులకు తెలిపారు. అనంతరం మహిళా ఉపాధ్యాయినిలు గువ్వాడ జానకమ్మ, బేపల పాపమ్మ, పొందర అఖిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.భీమారావు, ఎం.లక్ష్మణరావు, ఎ.అప్పారావు, ఎం.చిత్రసేను, జి.సూర్యానారాయణ, జి.చిన్నికృష్ణ, ఎం.దామోదరం, బి.రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## నరసన్నపేటలో మూడు రోజుల పాటు తాగునీటి సరఫరా నిలిపివేత

**నరసన్నపేట, మార్చి 9(వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీలో కుళాయిల ద్వారా అందిస్తున్న తాగునీటి సరఫరాను సోమవారం సాయంత్రం నుంచి మూడు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు పంచాయతీ ఈవోపీ ద్రాక్షాయిని తెలిపారు. దేవాది ప్రాంతంలో ఉన్న బోర్లు మరమ్మతులకు గురికావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. మరమ్మతుల పనులు పూర్తయ్యే వరకు సాయంత్రం వేళల్లో తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నామని వివరించారు. అయితే ఉదయం సమయంలో యథావిధిగా తాగునీటిని సరఫరా చేస్తామని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆమె కోరారు. మరమ్మతులు పూర్తయిన వెంటనే సాధారణంగా త్రాగునీటి సరఫరా పునరుద్ధరిస్తామని అధికారులు వెల్లడించారు.



## ఇష్టపడి చదివితేనే సత్ఫలితాలు

### -కస్తూర్బా గురుకుల పాఠశాలలో స్టడీ అవర్స్ పరిశీలించిన ఎంఈఓ ప్రసాదరావు



**జలుమూరు, మార్చి 9(వార్త):** కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే విద్యార్థులు మంచి ఫలితాలు సాధించగలరని ఎంఈఓ-2 ఎన్వీఆర్ఎస్ ప్రసాదరావు అన్నారు. సోమవారం జలుమూరు మండల కేంద్రంలోని కస్తూరి గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి విద్యార్థుల స్టడీ అవర్స్ కార్యక్రమాన్ని ఆయన పాఠశాల ప్రిన్సిపల్ యశోదతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదువు తీరును తెలుసుకొని వారికి సూచనలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు మరో వారం రోజుల్లోనే ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ పాఠాలను అర్థం చేసుకొని ఇష్టపడి చదవాలని సూచించారు. అలా చేస్తే పరీక్షల్లో మంచి విజయాలు సాధించవచ్చని అన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధమై మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# వరద కాలువను మాయం చేస్తున్నారు..!

**- రియల్ మాఫియా దందా**

**-వందలాది ఎకరాల భూములకు ప్రాణాధారాన్ని మట్టితో కప్పేస్తున్నారు**

**-కూటమి నేతలే తెరవెనుక సూత్రధారులు**



**పలాస, మార్చి 9(వార్త):**

పలాస మండలం కంబిరిగాంలో వరహాలు గెడ్డకు అనుసంధానంగా ఉన్న తుప్పల గుడ్డి వరద కాలువపై రియల్ మాఫియా కన్నేసిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వందలాది ఎకరాల పంట పొలాలకు సాగు నీరు అందించే ఈ కాలువను అక్రమంగా మట్టితో కప్పేస్తున్నారన్న సమాచారం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. పారసంబ, సొగాడియా, కాశీబుగ్గ ప్రాంతాల రైతుల పంట పొలాలకు నీరు అందించే ఈ వరద కాలువను క్రమంగా నాశనం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. భూముల ధరలు ఒక్కసారిగా పెరగడంతో కోట్ల రూపాయల విలువైన భూములను ప్లాట్లుగా మార్చుకునే ప్రయత్నంలో కాలువలపైనా, ఆ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పోరంబోకు భూములపై రియల్ మాఫియా కన్నేసిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికే జేసీబీలతో మట్టి, గ్రావెల్ తవ్వకాలు జరిపి కాలువను పూర్తిగా కప్పే ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం. ఇదిలా ఉండగా అనుమతులు లేకుండా తవ్వకాలు చేసినా, ప్రభుత్వ కాలువలను మట్టితో కప్పినా కఠిన చర్యలు తీసుకుంటామని పలాస తహసీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి హెచ్చరించినప్పటికీ అక్రమాలు ఆగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవసరమైతే క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. కొంతమంది కూటమి నాయకుల అండదండలతోనే ఈ అక్రమాలు జరుగుతున్నాయన్న అనుమానాలు కూడా బలపడుతున్నాయి. కాలువను కప్పేస్తే వందలాది ఎకరాల సాగుభూములు నీరులేక ఎండిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కాలువను రక్షించాలని, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకుని ఈ కీలక వరద కాలువను కాపాడతారా... లేక రియల్ ఎస్టేట్ మాఫియా దందా ముందు ప్రభుత్వం మౌనంగా ఉండిపోతుందా అన్నది ఇప్పుడు స్థానికంగా హాట్ టాపిక్‌గా మారింది.



## వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలి

**మందస, మార్చి 9(వార్త):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రస్థాయి బూత్ కమిటీ విభాగం సమావేశం విజయవాడలోని తాడేపల్లిలో గల పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పలాస నియోజకవర్గం స్థాయి బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడు చింతాడ గణపతి పార్టీ ఆహ్వానం మేరకు హాజరయ్యారు. సమావేశంలో భాగంగా ఆయన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ యాక్షన్ కమిటీ రాష్ట్ర జనరల్ కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసారు. సమావేశంలో వక్తలు మాట్లాడుతూ పార్టీ విజయానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారని గణపతి తెలిపారు. ఇప్పటి నుంచే కార్యకర్త సైనికుల్లా పని చేయాలని కోరారన్నారు. పలాస నియోజకవర్గంలో గల 284పోలింగ్ బూత్ లలో తప్పక విజయం చేకూర్చాలని సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారని గణపతి వివరించారు. అన్ని నియోజకవర్గలలో ఉన్న పోలింగ్ బూత్ లు ను ప్రతిష్టశీ చేసి పార్టీ గెలుపుకు కృషి చేయాలని మార్గ నిర్దేశం చేశారు. మందస మండలంలోని పితాతొళి గ్రామానికి చెందిన గణపతి భార్య సుధా సర్పంచ్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పార్టీలో కీలక బాధ్యతలు గణపతి మోస్తున్నారు. ఈ సందర్భంగా గణపతి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సమావేశంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సమావేశంలో చెప్పిన ప్రణాళికలను తప్పక పాటిస్తానని, పార్టీ కేడరును ఉత్తేజపరచి, 2029 ఎన్నికలతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు.



తనకీ అవకాశం కల్పించిన మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడులు తక్షణమే ఆపాలి




**పలాస, మార్చి 9(వార్త):** ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ గత పది రోజులుగా కొనసాగిస్తున్న దాడులను తక్షణమే ఆపాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి డి యస్ యు)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పలాస సూది కొండ కాలనీలో ఉన్న న్యూడెమోక్రసీ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశ్చిమ ఆసియా దేశాలపై ఆధిపత్యం కోసం, ఆయిల్ నిలవల కోసం అమెరికా ,ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దాడులను ప్రతి ఒక్కరు ఖండించాలని అన్నారు .అమెరికా, ఇజ్రాయిల్ ఇరాన్ పై చేసిన దాడిలో ఇప్పటికే 800 మందికి పైగా మరణించారని, ఇరాన్ లోని ఒక పాఠశాలలో పై దాడి జరగడం వల్ల 153 మంది విద్యార్థులు మరణించారని అన్నారు. ఇరాన్ లోని చమురు నిలువలపై దాడులు చేస్తూ ఉన్నారు. ఇరాన్ లోని ప్రభుత్వాన్ని అస్థిరత్వం చేసి కొత్త పాలన వచ్చేదాకా నిర్థాయిగా దాడులు చేస్తామని, ఇజ్రాయిల్ ప్రకటించడం సరైనది కాదని తెలిపారు. ఇరాన్ తోపాటు లెబనాన్ పై కూడా అమెరికా ఇజ్రాయిల్ దాడులు చేస్తా ఉందని అన్నారు. ప్రపంచానికి కావలసింది యుద్ధం కాదు శాంతి కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి డి యస్ యు జిల్లా నాయకులు గణేష్, రవి ,రాజు విజయ్, కుమార్ పాల్గొన్నారు.

## టీడీపీలో చేరిన వైసీపీ వార్డు సభ్యులు



**పోలాకి, మార్చి 9(వార్త):** ఈదులవలస పంచాయతీకి చెందిన ఇద్దరు వార్డు సభ్యులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. సోమవారం మబగాం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో వారిని టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈదులవలస పంచాయతీ వార్డు సభ్యులు ఎండ మల్లేశ్వర రావు, సురాన అప్పారావు వైసీపీని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వారు భవిష్యత్తులో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యేకు తెలిపారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి వారికి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ప్రజా సేవకు కట్టుబడి పార్టీ బలోపేతానికి కలిసి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులతో పాటు సుమారు 30 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొమ్మాళి బలరాం, దండుపాటి కుమార్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల ప్రారంభం



**ఇచ్ఛాపురం, మార్చి 9(వార్త):** బాలకృష్ణాపురంలో విబిజి రామ్‌జీ పథకం లో అనంత సాగర్ చెరువు పనులు ప్రారంభించారు. సుమారు నాలుగు వందల మంది మహిళలకు ఉపాధి కల్పించారు. ఈ కార్యక్రమంలో బోరుబద్ర లోహిదాస్ ,కోట రామోజీ, నర్తు వాసు, బతకల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన మోర్డ్ ఆడిట్ బృందం



**మందస, మార్చి 9(వార్త):** మందస మండలంలో మోర్డ్ ఆడిట్ బృందం పర్యటించింది. పలు అభివృద్ధి పనులను పరిశీలించిన మోర్డ్ ఆడిట్ బృందం పరిశీలించింది. చీపి, బిన్నలమదనాపురం పంచాయతీలలో బీటీ రోడ్డులు, కాలువలు తనిఖీ చేశారు. వీటికి సంబంధించిన రికార్డులు కూడా అధికారులు పరిశీలించారు. సీనియర్ అక్కౌంట్స్ అధికారి విపిన్ బంగర్, అక్కౌంటెంట్ పంకజ్, పీఓ అరవింద్, డ్వామా పీడీ అరవింద్ కుమార్, ఏపీడీ శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్, ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు, ఏపీఓ బీవీ హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపయోగంగా మారిన పశువుల నీటి తొట్టెలు

### - వినియోగంలోకి తేవాలని పాడి రైతుల విజ్ఞప్తి

**సారవకోట, మార్చి 9(వార్త):** గ్రామాల్లో పశువులకు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన నీటి తొట్టెలు ప్రస్తుతం నిరుపయోగంగా మారుతున్నాయి. సారవకోట మండలంలోని పలు గ్రామాల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. పశువులకు తాగునీరు అందించేందుకు గ్రామాల్లో నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ఉపాధి హామీ పథకం నిధులతో ఒక్కొక్కటి సుమారు రూ.25 వేల వ్యయంతో మండలంలో 25కు పైగా తొట్టెలు నిర్మించారు. అయితే వాటిలో నీరు అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుతం అవి ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో పశువులకు ఇవి ఉపయోగపడకపోవడంతో పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఈ నీటి తొట్టెలను వినియోగంలోకి తీసుకువచ్చి పశువులకు తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని పాడి రైతులు అధికారులను కోరుతున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సత్యవరంలో ఉపాధ్యాయినిలకు ఘన సత్కారం



**నరసన్నపేట, మార్చి 9(వార్త):** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నరసన్నపేట మండలం సత్యవరం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులను సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఆదివారం సెలవు రోజు కావడంతో సోమవారం పాఠశాలలో మహిళా దినోత్సవం నిర్వహించినట్లు తెలిపారు.

విద్యార్థులు మహిళా ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలు విద్యా రంగంలో చేస్తున్న సేవలను కొనియాడుతూ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

# కంబిరిగాంలో గోర్జి హాంఫట్!

### -సుమారు కోటి విలువైన స్థలంపై
### ప్రముఖ జీడి వ్యాపారి కన్ను
### -గోడ కట్టి గ్రావెల్‌తో కప్పేసిన వైనం
### -ఫిర్యాదులు ఉన్నా చర్యలు తీసుకోని అధికారులు



**పలాస, మార్చి 9(వార్త):** పలాస మండలం కంబిరిగాంలో ప్రభుత్వ భూమిపై భూదందా ఆరోపణలు సంచలనం రేపుతున్నాయి. సర్వే నెంబర్ 34/5లో ఉన్న సుమారు 38 సెంట్ల ప్రభుత్వ గోర్జిని పలాసకు చెందిన ఓ జీడి పారిశ్రామికవేత్త అక్రమంగా ఆక్రమించుకున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. స్థానికుల వివరాల ప్రకారం ఈ ప్రభుత్వ గోర్జి విలువ ప్రస్తుతం సుమారు రూ. కోటి వరకు ఉంటుందని చెబుతున్నారు. ఈ భూమిని పూర్తిగా స్వాధీనం చేసుకునేందుకు ఆక్రమణదారులు ఇప్పటికే చుట్టూ గోడ కట్టి, గ్రావెల్‌తో కప్పేసి స్థలాన్ని సమతలపరిచే పనులు చేసినట్టు గ్రామస్తులు వెల్లడిస్తున్నారు. దీంతో ప్రభుత్వ భూమిని క్రమంగా వ్యక్తిగత ఆస్తిగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై కంబిరిగాం, కేదారిపురం గ్రామాలకు చెందిన మాజీ సైనికులు, యువత, స్థానిక నాయకులు పలుమార్లు పలాస తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించి ఫిర్యాదులు చేశారు.



ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటి వరకు అధికారుల నుంచి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో గ్రామస్తుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించడంపై స్పష్టమైన ఆధారాలు ఉన్నప్పటికీ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ శాఖ అధికారులు ఈ వ్యవహారాన్ని పట్టించుకోకపోవడం వెనుక కారణాలేమిటన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉంటే "సేవ్ పలాస... సేఫ్ పలాస" అంటూ అక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని ప్రకటించిన ఎమ్మెల్యే గౌతు శిరీష కూడా ఈ అంశంపై మౌనం వహించడం పలు ప్రశ్నలకు తావిస్తోందని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు. భూదందాపై చర్యలు తీసుకుంటామని చెప్పిన నాయకత్వం ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు చర్యలకు వెనకాడుతున్నారా...? లేక అధికారుల అండతోనే భూదందా కొనసాగుతోందా...? అనే అనుమానాలు గ్రామస్తుల్లో వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ప్రభుత్వ గోర్జిని ఆక్రమణదారుల నుంచి రక్షించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## మందస ఎంపీడీఓ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**మందస, మార్చి 9(వార్త):** మందస మండల పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా మహిళా సిబ్బందిని ఘనంగా సన్మానించారు. టైపిస్ట్ ఎస్.ధనలక్ష్మి, ఆఫీస్ సబ్ ఆర్డినేట్ ఇందిరలను దుశ్శలువా కప్పి, పూలమాలలతో సత్కరించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ మహిళా శక్తి సామర్థ్యలను, మహిళా దినోత్సవం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.వెంకటరమణ, డిప్యూటీ ఎంపీడీఓ తిరుమలకుమార్, మండల పరిషత్ పరిపాలన అధికారి బి.రుషేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ హెచ్.సురేష్, కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

## లక్కీ షాపింగ్ మాల్ ఆర్థికసాయం



**పలాస, మార్చి 9 (వార్త):** లక్కీ షాపింగ్ మాల్ పనిచేస్తున్న జయలక్ష్మి భర్త ఇటీవల కాలంలో మృతి చెందిన విషయం తెలుసుకొని లక్కీ షాపింగ్ మాల్ యాజమాన్యం 30 వేల రూపాయల ఆర్థిక సహాయం సోమవారం అందజేశారు. లక్కీ షాపింగ్ మాల్ లో జరిగిన ఆర్థిక సహాయమును జయలక్ష్మికి అందజేశారు. లక్కీ షాపింగ్ మాల్ లో గత మూడు సంవత్సరాలుగా ఆర్‌ఎఫ్ కౌంటర్లో పనిచేస్తున్న ఉద్యోగిని కొంటియాన జయలక్ష్మి ఆమె భర్త కొంటియాన దాసు ఈ మధ్యకాలంలో అనారోగ్యంగా ఉండడంవల్ల అతను మృతి చెందాడు. పేద పరిస్థితి కావడం వల్ల రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి వల్ల ఇద్దరు పిల్లల్ని పెంచుకుంటూ జీవనోపాధి గడుపుతున్నటువంటి జయలక్ష్మికి లక్కీ షాపింగ్ మాల్ యాజమాన్యం, మేనేజ్మెంట్ అండ్ స్టాఫ్ అందరు కలిసి 30 వేల రూపాయలు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్కీ షాపింగ్ మాల్ మేనేజర్లు స్వామి యాదవ్, శ్రీహరి యాదవ్, సూపర్వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 14-15 ఏళ్ల బాలికలకు ఉచిత హెచ్‌పివి టీకా పంపణీ



**సరుబుజ్జిలి, మార్చి 9(వార్త):** భారతదేశ భవిష్యత్తును నిర్మించే ఆడబిడ్డల ఆరోగ్యం కోసం ప్రధాని నరేంద్ర మోడీ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు వెల్ఫుల గోవిందా రావు తెలిపారు. సర్వైకల్ క్యాన్సర్ ముప్పు నుంచి సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు 14-15 ఏళ్ల బాలికలకు ఉచిత హెచ్ పి వి టీకా పంపిణీ కార్యక్రమాన్ని ఫిబ్రవరి 28న ప్రారంభించారని అన్నారు. ఈ కార్యక్రమం 3 నెలల పాటు దేశవ్యాప్తంగా కొనసాగుతుందని తెలిపారు. కనుక 14-15 ఏళ్ల బాలికల తల్లిదండ్రులు దయచేసి ఈరోజే తమ సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి టీకా ఇప్పించి, ఆడబిడ్డల భవిష్యత్తుకు భరోసానివ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు శ్రద్ధగా సిద్ధం కావాలి

### - లింగాలపాడు జడ్పీ పాఠశాలలో స్టడీ అవర్స్ పరిశీలించిన ఎంఈఓ బమ్మిడి మాధవరావు

**జలుమూరు, మార్చి 9(వార్త):** పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు మరింత శ్రద్ధగా చదువుకొని పరీక్షలకు సిద్ధం కావాలని ఎంఈఓ--1 బమ్మిడి మాధవరావు సూచించారు. సోమవారం జలుమూరు మండలం లింగాలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్టడీ అవర్స్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి చదువు తీరును తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కేవలం బట్టి పెట్టే విధానాన్ని వీడి పాఠాలను పూర్తిగా అర్థం చేసుకొని చదవాలని సూచించారు. పాఠ్యాంశాలను సరిగా గ్రహించి తరచుగా మననం చేసుకుంటే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించగలరని తెలిపారు. అలాగే పరీక్షల పట్ల భయం లేదా ఆందోళన చెందకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరుకావాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు ఇచ్చే సూచనలు పాటిస్తూ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఎస్పీ గ్రీవెన్స్‌కు 47 వినతులు



**శ్రీకాకుళం, మార్చి 9(వార్త):** ప్రజా పిర్యాదులు చట్ట పరిధిలో పరిష్కారం చూపాలని, ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వేదికలో (పిజిఆర్ఎస్) స్వీకరించే ఫిర్యాదులు పరిష్కారానికి శ్రద్ధ వహించి ఆయా ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి, త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ అధికారులను అదనపు ఎస్పీ (అడ్మిన్) కెవి రమణ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ మరియు పరిష్కార కార్యక్రమంలో అదనపు ఎస్పీ 47 మంది, ఫిర్యాదు దారులు నుంచి వినతలు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదు దారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు తక్షణమే ఫోన్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులకు తెలియ పరిచి చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు. అర్జీ దారులు వద్దకు స్వయంగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయా ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా, తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని అదనపు ఎస్పి కెవి రమణ అధికారులను ఆదేశించారు. ఈ 47 ఫిర్యాదులలో కుటుంబ సభ్యులు, ఆస్తి తగాదాలు, వ్యక్తిగత గొడవలు, మోసపూరితమైన వంటి అంశాలపై ప్రజా ఫిర్యాదులు అందాయి.

## ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలి




**బూర్జ, మార్చి 9(వార్త):** బూర్జ ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆముదాలవలస శాసనసభ్యుడు రాష్ట్ర పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ (ప్రాఖజ) చైర్మన్ కూన రవికుమార్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల అమలు, గ్రామాల్లో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. మండలంలో రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, విద్య, వైద్య సేవల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

**మందస, మార్చి 9(వార్త):** మందస మండలంలోని హరిపురం, ఉద్దానం ప్రాంతంలో ఈనెల 11న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ గుల్ల యజ్ఞేశ్వరరావు, జేఈ లఖినాన దినకర్ చెప్పారు. 33/11 హరిపురం సబ్ స్టేషన్ లో ఆర్డీఎస్ఎస్ విభాగంలో ఉద్దానం ఫీడర్ బైఫుర్కేషన్ వర్క్ లో భాగంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు హరిపురంటౌన్ లోని పెద్దవీధి, కాపు వీధి, హెచ్చి కాలనీ, బీఎంపురం, రట్టి, బేతాళపురం, బహడపల్లి, నారాయణపురం, సువర్ణపురం, మర్రిపాడు, అంబుగాం, పిడిమందస, కుంటికోట, వీజీపురం పరిసరి ప్రాంతాలకు విద్యుత్ నిలిపివేయబడుతుందన్నారు. విద్యుత్ శాఖ సిబ్బందికి వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

# విద్య, అవగాహనతోనే మహిళా సాధికారత



**పోలాకి, మార్చి 9(వార్త):** మహిళలు జనాభాలో సగ భాగంగా ఉన్న నేపథ్యంలో వారు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని అన్ని రంగాల్లో ముందుకు సాగినప్పుడే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుందని కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.శాంతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలాకి మండలం కోడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు జి. శాంతి, ఉపాధ్యాయినిలు జి. మోహిని, ఎం. శాంతి, వి. హేమలత, పి. కళావతి, మహిళా ఉద్యోగులు కె. సూర్యకుమారి, రమణమ్మ, ఎం. రాధతో పాటు ఆయాలు నాగమ్మ, విజయమ్మలను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జి. శాంతి మాట్లాడుతూ మహిళలు తమ హక్కులు, బాధ్యతలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని, వారు అన్ని రంగాల్లో ముందుకు రావాలని అన్నారు. మహిళా ఉపాధ్యాయినిలు మోహిని, శాంతి, హేమలత, కళావతి మాట్లాడుతూ మహిళలకు విద్య ద్వారా చైతన్యం కలుగుతుందని పేర్కొన్నారు.

చదువు ద్వారా మహిళలు తమ సమస్యలను అర్థం చేసుకొని వాటి పరిష్కారానికి తామే ముందుకు రావచ్చని తెలిపారు. మహిళా ఉద్యోగులు సూర్యకుమారి, రమణమ్మ, రాధ మాట్లాడుతూ సమాజంలో మహిళలపై వివక్ష పూర్తిగా తొలగిపోయి వారికి గౌరవం, సమానత్వం లభించే రోజులు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చింటాడ లక్ష్మణరావు, ఎం. వేణుగోపాలరావు, వెంకటరమణ, నారాయణరావు, శ్రీహరి, జగన్, బాడాన రాజు, రాజేశ్వరరావు, రఫీ, వసంతరావు, రాంబాబు, అలాగే సిబ్బంది గణేష్, చంద్రయ్య, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

# అందరికీ ఉపాధి కల్పించాలి

**సంతబొమ్మాళి, మార్చి 9(వార్త):** జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి పని కల్పించాలని మాజీ ఎంపీపీ ప్రతినిధి కర్రి విష్ణుమూర్తి అన్నారు. మండలంలో నౌపడ పంచాయతీకి సంబంధించి స్థానిక సచివాలయంలో 2024- 25 ఆర్థిక సంవత్సరం సంబంధించి జరిగిన ఉపాధి పనులు, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ పనులపై డిఆర్పి జె .హిమగిరి, బి. పాపారావు ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్ చేపట్టి సోమవారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీకి సంబంధించి 93 ఉపాధి పనులకు గాను 98 లక్షల 13 వేల 475 రూపాయలు, పంచాయతీరాజ్ సంబంధించి 8 పనులకు గాను 14,51,252 ఆర్డబ్ల్యూఎస్ కు సంబంధించి ఐదు పనులకు గాను 94,437 రూపాయలు ఖర్చులపై సోషల్ ఆడిట్ వివరాలను తెలియజేశారు. ఉపాధి నేమ్ బోర్డుకి సంబంధించి 5400 అవినీతి జరినట్లు గుర్తించారు. ఎటువంటి ఇల్లు నిర్మాణం చేయకపోయినా సీతానగరం గ్రామానికి చెందిన బచ్చల ఢిల్లీ రావుకు 12,298 రూపాయలు, అనపాన సరోజిని కి అదనంగా 18 రోజులు పేమెంట్ ను చెల్లించారని గుర్తించారు. మరణించిన తర్వాత కూడా దారపు రాజారావుకు మూడు వేల రూపాయలు, దుక్క సుందరమ్మకు 2100 ఇల్లు బిల్లులు చెల్లించినట్లు గుర్తించారు. గిన్ని సరోజిని పేరున ఉన్న ఇల్లు బిల్లులను కర్రి పురుషోత్తం అకౌంట్ కు 3200 రూపాయలు జమ అయినట్లు సోషల్ ఆడిట్ బృందం గుర్తించారు. పంచాయతీరాజ్ కు సంబంధించి రోడ్డు పనులకు గాను పదివేల 737 రూపాయలు బిల్లులు చెల్లించిన దానికి సంబంధించి మాస్టర్లను అందజేయలేదని తెలియజేశారు. దుర్గమ్మ చెరువు సంబంధించి కొలతల ప్రకారం కాకుండా అదనంగా వేతనదారులకు బిల్లులు చెల్లించినట్లు సోషల్ ఆడిట్ బృందం గుర్తించారు. ఇతర గ్రామాలల్లో పనులు జరుగుతున్న మా పంచాయతీలో ఇంతవరకు ఉపాధి పనులు కల్పించలేదంటూ పలువురు వేతనదారులు సోషల్ ఆడిట్ బృందం దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉప్పాడ ఉమాపతి, ఎస్ .స్వరూప్, కె.శంకర్ రెడ్డి, ఎల్ కుమార్, తదితరులు ఉన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పులకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

**-తల్లిదండ్రులను కలిసిన ఎంఈఓ**

**నరసన్నపేట, మార్చి 9(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేర్పులను పెంచేందుకు నరసన్నపేట మండలం లోని బోర్డు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి సోమవారం ఎంఈఓ శాంతారావు ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వ హించారు. ఈ సందర్భంగా కలివరంపేట వీధిలో విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్యతో పాటు పలు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ఎంఈఓ వివరించారు. తల్లిదండ్రులను ఒప్పించి పాఠశాల ప్రవేశ దరఖాస్తులను స్వీకరించారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.



## అర్జీలు పరిష్కరించాలి

**- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**-పీజీఆర్ఎస్ వేదికలో 116 వినతుల స్వీకరణ**



**శ్రీకాకుళం, మార్చి 9(వార్త):** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని బాధితుల నుండి వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారంలో కాలయాపన చేయకుండా, అర్జీదారులకు సంతృప్తి కలిగేలా నిర్ణీత గడువులోగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సాయంత్రం 5:15 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా జిల్లా వ్యాప్తంగా మొత్తం 116 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఈ వినతుల్లో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 28 అర్జీలు రాగా, సెర్ప్ విభాగంలో 26, పంచాయతీ రాజ్ శాఖకు 14, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పరిధిలో 10 వినతులు అందాయి. రెవెన్యూ క్లినిక్ సందర్శన: అర్జీల స్వీకరణ అనంతరం కలెక్టర్ అక్కడే ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్ డెస్క్‌లను సందర్శించారు. మండలాల వారీగా ఉన్న సిబ్బందితో మాట్లాడుతూ, ప్రజలు సమర్పించిన భూ సంబంధిత సమస్యల స్వభావాన్ని అడిగి తెలుసుకున్నారు. నేరుగా దరఖాస్తుదారులతో ముచ్చటించి, వారి సమస్యల పరిష్కారానికి సంబంధించి అక్కడికక్కడే రెవెన్యూ సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా క్షేత్రస్థాయిలోనే సమస్యలు పరిష్కారమవ్వాలని ఆయన ఉద్ఘాటించారు.

## శిథిలావస్థకు పోలీస్ క్వార్టర్స్

**- కొత్త భవనాలు నిర్మించాలని సిబ్బంది విజ్ఞప్తి**



**నరసన్నపేట, మార్చి 9వార్త):** నరసన్నపేట పోలీస్ స్టేషన్‌కు చెందిన సిబ్బంది కోసం సుమారు 25 సంవత్సరాల క్రితం ప్రత్యేకంగా నిర్మించిన క్వార్టర్స్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. దాదాపు పదేళ్లుగా ఈ క్వార్టర్స్ వినియోగంలో లేక మూలకు చేరిపోయినట్లు సమాచారం. దీంతో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది అద్దె ఇళ్లలోనే నివాసం ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) వసతి గృహం కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో వినియోగించలేని పరిస్థితి ఏర్పడింది. పోలీస్ శాఖకు చెందిన ఈ విలువైన స్థలంలో కొత్తగా క్వార్టర్స్ నిర్మించి సిబ్బందికి వసతి సదుపాయం కల్పించాలని పోలీసులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు.

## కొత్త రోడ్డు జంక్షన్ బ్రిడ్జ్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే గొండు శంకర్

**- రాయపాడులో ప్రజల సమస్యలపై స్పందన**

**శ్రీకాకుళం, మార్చి 9(వార్త):** శ్రీకాకుళం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగేందుకు ఎమ్మెల్యే గొండు శంకర్ చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని కొత్త రోడ్డు జంక్షన్ వద్ద కొనసాగుతున్న బ్రిడ్జ్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని అక్కడ జరుగుతున్న పనులపై పలు సూచనలు చేశారు. జంక్షన్ ప్రాంతం రద్దీగా ఉండే ప్రదేశం కావడంతో వాహన రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్‌ను నియంత్రించేలా తగిన ఏర్పాట్లు చేయాలని, ప్రజలు సురక్షితంగా ప్రయాణించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అదేవిధంగా పనులు నాణ్యతగా నిర్వహించాలని, ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా బ్రిడ్జ్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనులు ఆలస్యం కాకుండా వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ఈ జంక్షన్ అభివృద్ధి పూర్తయితే ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గి ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే గొండు శంకర్ రాగోలు మండల పరిధిలోని రాయపాడు గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని పలు వీధుల్లో తిరిగి స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో కొన్ని ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయని, వర్షాకాలంలో నీరు నిలిచిపోతుందని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అలాగే డ్రైనేజీ కాల్వలు సరిగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.ప్రజల సమస్యలను ఓర్పుగా విన్న ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో రోడ్ల అభివృద్ధి, కాల్వల నిర్మాణం వంటి పనులను ప్రాధాన్యతగా తీసుకుని త్వరలోనే పూర్తి చేసేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు.గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి గ్రామంలో రోడ్లు, కాల్వలు, తాగునీటి వంటి మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు చర్యలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# తాగుతూ..ఊగుతూ..!



**-మద్యం మత్తులో జోగుతున్న గ్రామాలు**

**-ఎక్కడిక్కడే బెల్ట్ షాపులు**

**-యథేచ్ఛగా అమ్మకాలు**

**సరుబుజ్జిలి, మార్చి 9(వార్త):** సరుబుజ్జిలి మండలంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. 21 గ్రామ పంచాయతీల్లో గల్లీకి ఒకటి, రెండు బెల్ట్ షాపులు చెప్పున ఉన్నాయి. గ్రామాల్లో మద్యం విక్రయాలు అధికంగా జరగ డంతో మందుబాబులకు అడ్డాగా మారాయి. ఉదయం నుంచి రాత్రి వరకు మద్యం అమ్మకాలు జోరుగా సాగడంతో బెల్ట్ షాపుల్లో మద్యం ఏరులై పారు తోంది. బెల్ట్ షాప్‌లు లేవని అధికారులు చెబుతున్నా అది లెక్కల వరకే పరి మితం అవుతున్నాయి. నూతనంగా ఎక్సైజ్ శాఖ మద్యం పాలసీని తీసుకువచ్చి ఎంఆర్‌పి ధరకే విక్రయించేలా, కల్తీ మద్యం అరికట్టేలా చర్యలు తీసు కుంటున్నట్లు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి లేదు. దీంతో బెల్ట్ షాపు నిర్వాహకులకు హద్దు లేకుండాపోతుంది. ఫలితంగా వారి వ్యాపారం మూడు క్వార్టర్లు.. ఆరు బీర్లుగా కొనసాగుతోంది. ఎనీ టైమ్ మద్యంగ్రామాల్లో అనధి కారికంగా ఏర్పాటు చేసుకున్న బెల్ట్ షాపులు అర్ధరాత్రి వరకు అందుబాటులో ఉంటున్నాయి. గ్రామాల్లో కూలీ పనులు చేసుకునే నిరుపేదలు బెల్ట్ షాపులకు అలవాటుపడి కనీసం కూలి పనులకు పోకుండా నిత్యం మద్యం మత్తులో ఉంటున్నారు. మండలంలో ఉన్న ఐదు మద్యం షాపుల నుంచి మద్యం కొనుగోలు చేసి గ్రామాలకు తీసుకొని వెళ్ళి ఒక మద్యం బాటల్ పై ఎమ్మార్పీ కంటే రూ.50 అదనంగా వసూళ్లు చేస్తున్నారు. సంబంధిత అధికారులు



వసూళ్లు మత్తులో ఉండటంతో పట్టించుకోవడంలేదని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

గల్లీకి ఒక బెల్ట్ షాప్ ఉండడంతో మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి బెల్ట్ షాపులు నియంత్రించాలని మహిళలు కోరుతున్నారు.

# పెంచిన వంట గ్యాస్ ధర వెంటనే తగ్గించాలి




**శ్రీకాకుళం, మార్చి 9(వార్త):** పెంచిన వంట గ్యాస్ ధర వెంటనే తగ్గించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.అమ్మన్నాయుడు పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె. నాగమణి, ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె మోహనరావు డిమాండ్ చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ పై 60 రూపాయలు, వాణిజ్య సిలిండర్ పై 115 రూపాయలు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ సిఐటియు, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో అంబేద్కర్ జంక్షన్ వద్ద సిలిండర్ పెట్టి పెంచిన వంటగ్యాస్ ధరలు తగ్గించాలని నినాదాలు చేస్తూ నిరసన ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు, ప్రజలు నడ్డి విరిచే విధంగా వంట గ్యాస్ ధరలు పెంచి ప్రజలకు తీవ్ర బారాలు వేసిందని అన్నారు. వంట గ్యాస్ ధరలు పెరగడంతో సామాన్య, మధ్యతరగతి, చిల్లర వర్తకులు తీవ్ర అబ్బందులు పడతారని అన్నారు. ఒకవైపు వంట నూనెలు, నిత్యావసరాలు ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో మరో వైపు గ్యాస్ ధర పెంచడం దూర్మార్గమన్నారు. తక్షణమే వంట గ్యాస్ ధరలు తగ్గించాలని కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అన్నారు. ఒకరు కాదు ముగ్గురు పిల్లల కనాలని చంద్రబాబు చేప్తున్నారని ఒకరిద్దరు పిల్లలతోనే కుటుంబం గడవక ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికే నిత్యవసర వస్తువులు ధరలు విపరీతంగా పెరిగాయని కార్మికుల ఉద్యోగులు వేతనాలు మాత్రం పెంచడం లేదని అన్నారు. ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం పేరుతో గ్యాస్ ధరలను పెంచుకుంటూ పోతుండడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. రష్యా నుంచి ఇండియాకు చమురు, గ్యాస్ సరఫరాలపై ఆర్థిక ఆంక్షలు ఎత్తేసింది. ఇండియాకు తగ్గింపు ధరలతో గ్యాస్, పెట్రోలియం ఉత్పత్తులను రష్యా విక్రయిస్తోందని అయినప్పటికీ గ్యాస్ ధరల్ని తగ్గించకుండా పెంచడం విస్మయాన్ని కలిగిస్తోందని అన్నారు.కేంద్రంలోని బిజెపి సర్కారు గ్యాస్ ధరల్ని ఇష్టారాజ్యంగా పెంచుకుంటూ పోతోందని, గ్రామీణ గృహిణులు కట్టెల పొయ్యికి మరల పోతున్నట్లు వార్తలు వస్తున్నాయని అన్నారు. గ్యాస్ సబ్సిడీని కస్టమర్ల ఖాతాల్లో జమ చేయడం లేదని అన్నారు. ఒకవైపు సబ్సిడీని వినియోగదారుల ఖాతాల్లో జమ చేయకపోవడం, మరోవైపు ఉన్న ఫళంగా గ్యాస్ ధరలను అమాంతంగా పెంచడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. వెంటనే ధరలు తగ్గించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయుకులు అల్లు మహాలక్ష్మి, యన్ గణపతి, యమ్ ఆదినానారాయణ మూర్తి, అల్లు సత్యన్నారాయణ, కేశవరావు, యమ్ గోవర్ధనరావు ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి పొలాకి ప్రసాదరావు, కొత్తకోట అప్పారావు పాల్గొన్నారు.

# పేదలకు సౌర విద్యుత్ వరం

**-పీఎం సూర్య ఘర్ యోజనతో**

**విద్యుత్ ఖర్చులకు చెక్**

**- ఎమ్మెల్యే గొండు శంకర్**

**-పాత్రునివలసలో ప్రారంభం**

**శ్రీకాకుళం, మార్చి 9(వార్త):** పాత్రునివలస గ్రామంలోని ఎస్సీ కాలనీలో 60 కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ యోజన పథకం కింద ఉచితంగా సోలార్ రూఫ్ టాప్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని లబ్ధిదారులకు సోలార్ రూఫ్ టాప్సఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్య ఘర్ యోజన పథకాన్ని ప్రారంభించిందన్నారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన మరియు తక్కువ ఖర్చుతో విద్యుత్ అందించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల పైకప్పులపై సోలార్ రూఫ్ టాప్స్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా కుటుంబాలు స్వయంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకుని తమ అవసరాలను తీర్చుకోవచ్చని చెప్పారు.ఇప్పటి వరకు ప్రజలు పూర్తిగా విద్యుత్ శాఖపై ఆధారపడేవారని, కానీ ఇప్పుడు సోలార్ విద్యుత్ ద్వారా స్వయం సమృద్ధిసాధించగలుగుతారని ఆయన పేర్కొన్నారు.

ఈ పథకం ద్వారా విద్యుత్ బిల్లులు గణనీయంగా తగ్గడంతో పాటు అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇవ్వడం ద్వారా లబ్ధిదారులకు మరింత లాభం కలిగే అవకాశం ఉందన్నారు.పర్యావరణ పరిరక్షణలో కూడా సోలార్ విద్యుత్ కీలక పాత్ర పోషిస్తుందని, సంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడకుండా స్వచ్ఛమైన విద్యుత్ ఉత్పత్తి చేయడం వల్ల కాలుష్యం తగ్గుతుందని తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలంటే ఇలాంటి పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికంగా ఉపశమనం కలిగించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరిస్తోందన్నారు. జిల్లాలో మొదటిసారిగా పాత్రునివలస గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో మరిన్ని గ్రామాల్లో కూడా ఈ పథకాన్ని విస్తరించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఇంకా ఎక్కువ మంది ఈ పథకాన్ని వినియోగించుకుని తమ ఇళ్లలో సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుని విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పాత్రుని వలస సర్పంచ్ అప్పలనాయుడు, ఎలక్ట్రికల్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, , గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546